వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 254 సోమవారం | 15 ఏప్రిల్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5

వడ్డీల పేరుతో వేధిస్తే

## కఠిన చర్యలు

ఐజీ ఏవీ రంగనాథ్



8 లో..



8 లో..

సీతారాముల కల్యాణ

## ప్రత్యక్ష ప్రసారానికి అనుమతివ్వండి

ఎన్నికల కమిషనర్‌ను కోరిన మంత్రి సురేఖ

# రెండు వైన్లు.. 200 బెల్టు షాపులు





ఎన్నికల వేళ మల్హార్‌లో జోరుగా మద్యం దందా

'మామూలుగా ' తీసుకుంటున్న అధికారులు

రాత్రి పగలు తేడా లేకుండా అమ్మకాలు

ఒక్కో క్వార్టర్‌పై అదనంగా రూ.40

నిర్వాహకులకు ఆదాయం.. నింద మాత్రం ప్రభుత్వానికి

ఛిద్రం అవుతున్న మధ్య తరగతి కుటుంబాలు



ఎన్నికల వేళ మల్హార్ మండలంలో బెల్ట్ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. అధికారికంగా మండల కేంద్రం తాడిచెర్లలో ఒకటి, కొయ్యూరులో మరొక వైన్ షాప్ మాత్రమే ప్రభుత్వ అనుమతితో పనిచేస్తుండగా గల్లీకోటి.. గ్రామంలో ఐదునుంచిపది.. ఈ లెక్కన మండల వ్యాప్తంగా సుమారు 200లకు పైగా బెల్ట్ షాపులు అనధికారికంగా మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నాయి. రాత్రి పగలు తేడా లేకుండా అమ్మకాలు చేయడంతో మధ్య తరగతి కుటుంబాలు ఛిద్రం అవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో క్వార్టర్‌కు బ్రాండ్‌ను బట్టి ఎమ్మార్పీపై రూ.40 వరకు అదనంగా వసూలు చేస్తున్నా ఇది మామూలే అన్నట్లుగా ఎక్సైజ్ శాఖ అధికారులు వ్యవహరించడంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బెల్ట్ షాపుల్లో విక్రయాలతో నిర్వాహకులకు పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుతుండగా నింద మాత్రం ప్రభుత్వంపై పడుతుందంటున్నారు. బెల్ట్ షాపుల పుణ్యాన ప్రభుత్వానికి లక్షల్లో ఆదాయానికి గండిపడుతుండగా.. మద్యం ప్రియులకు మాత్రం అంతకు రెట్టింపు భారం పడడంతో జేబు గుల్ల అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు 2లో..

- వరంగల్ వాయిస్, మల్హార్

## ఇంటి బిడ్డగా మీ ముందుకొస్తున్నా..

- ఆశీర్వదించి పార్లమెంటుకు పంపండి
- అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తా
- కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య



8లో



## ఏడో రోజుకు చేరిన వసంత నవరాత్రులు

లిల్లీ పూలతో అమ్మవారికి అర్చన నగరంలోని సుప్రసిద్ధ భద్రకాళి దేవాలయంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రులు సోమవారం ఏడో రోజుకు చేరుకున్నాయి. ఉదయం సుప్రభాత సేవ, నిత్యాహ్నికం అనంతరం అమ్మవారికి లక్ష లిల్లీ పులతో అర్చన నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందారు. మధ్యాహ్నం తోట జగన్నాదం దంపతుల ఆధ్వర్యంలో రెండు వేల మందికి అన్నదానం నిర్వహించారు.

- వరంగల్ వాయిస్, వరంగల్

# రెండు వైన్సు.. 200 బెల్ట్ షాపులు

- ఎన్నికల వేళ మల్హర్‌లో జోరుగా మద్యం దందా
- 'మామూలుగా ' తీసుకుంటున్న అధికారులు
- రాత్రి పగలు తేడా లేకుండా అమ్మకాలు
- ఒక్కో క్వార్టర్ పై అదనంగా రూ.40
- నిర్వాహకులకు ఆదాయం.. నింద మాత్రం ప్రభుత్వానికి
- ఛిద్రం అవుతున్న మధ్య తరగతి కుటుంబాలు





**వరంగల్ వాయిస్, మల్హర్ :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలో బెల్ట్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. అధికారికంగా మండల కేంద్రం తాడిచెర్లలో ఒకటి, కొయ్యూరు మరోక వైన్ షాప్ మాత్రమే ఉండగా బెల్ట్ షాపులు మాత్రం ప్రతి గ్రామంలో ఐదు నుంచి పది చొప్పున మండల వ్యాప్తంగా సుమారు 200 వరకు మద్యం విక్రయాల్లో తరిస్తున్నాయి. లక్షలు ఖర్చు పెట్టి కొనుగోలు చేసిన వైన్ షాపుల్లో ఎమ్మార్పీ ధరకు మద్యం అమ్మితే లాభాలు ఏం వస్తాయి అనుకున్నారో ఏమో అనుకున్నదే తడువుగా బెల్ట్ దందాకి వైన్ షాప్ నిర్వాహకులు తెర లేపినట్లు ప్రచారం సాగుతోంది. వారి అండదండలతోనే గల్లీ కొకటి..గ్రామంలో ఐదునుంచి పది బెల్ట్ షాపులు పుట్టుకొచ్చాయి.

## బెల్ట్ షాపుల్లో ప్రముఖ బ్రాండ్లు..

అధికారిక వైన్ షాపుల్లో మామూలు లిక్కర్ అందుబాటులో ఉంచి ప్రముఖ బ్రాండ్లకు చెందిన మద్యాన్ని మాత్రం నేరుగా బెల్ట్ షాపులకు తరలిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. వైన్ షాపు యజమానులు ఒక్కో క్వార్టర్ పై రూ.25 కమిషన్ తో మద్యం మొత్తాన్ని బెల్ట్ షాపులకు తరలిస్తుండగా బెల్ట్ షాప్ నిర్వాహకులు మరో రూ.15 అదనంగా తీసుకుంటూ విక్రయాలు కొనసాగిస్తున్నారు. దీంతో కొనుగోలు దారుడిపై ఒక్కో క్వార్టర్ కు రూ.40 అదనపు భారం పడడంతో జేబులు గుల్లా అవుతున్నాయి. వైన్ షాప్ కి వచ్చిన వినియోగదారులకు మాత్రం అడిగిన బ్రాండ్ మద్యం కాకుండా ఇతర బ్రాండ్ లకు చెందిన మద్యం సీసాలు అంటగడుతున్నట్లు మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. అడిగిన బ్రాండ్ ఇవ్వకపోవడంతో మద్యం దుకాణాలపై దాడులు నిర్వహించిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

## అంతా మామూలే..

ఇదంతా అధికారుల కళ్లముందే జరుగుతున్న అటు ఎక్సైజ్ అధికారులు కానీ ఇటు పోలీస్ అధికారులు కానీ బెల్ట్ షాప్ ల వైపు కన్నెత్తి చూడడంలేదు. గత కొన్ని సంవత్సరాలుగా అధికారులు మండలంలో ఏ ఒక్క బెల్ట్ షాప్ పై దాడి చేసి మద్యం సీజ్ చేసిన ఘటనలు నమోదు కాలేదంటే ఎంత పకడ్బందీగా బెల్ట్ దందా నడుస్తుందో అర్థం చేసుకోవచ్చు. బెల్ట్ షాపులపై వచ్చే అధిక ఆదాయం ఏమైనా ప్రభుత్వానికి వెళ్తుందా అంటే అది లేదు. అధిక ఆదాయం మొత్తం నిర్వాహకులు జేబుల్లోకి వెళ్తుండగా బెల్ట్ షాప్ నిందలని ప్రభుత్వం మోయాల్సి వస్తోంది.

## ప్రత్యేక వాట్సప్..

వైన్ షాప్ నిర్వాహకులు, ఎక్సైజ్ అధికారులు, బెల్ట్ షాపు యజమానులతో కలిపి ప్రత్యేక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి మరీ దందా కొనసాగిస్తుండటం గమనార్హం. మరో నెల రోజుల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న తరుణంలో వైన్ షాప్ నిర్వాహకులు ముందు జాగ్రత్తగా లక్షల విలువ చేసే మద్యాన్ని ఆటోలు, బైక్ లపై వైన్ షాప్ లకు తరలిస్తున్నారు. మండల కేంద్రం తాడిచెర్లలోనే సుమారు 40 బెల్ట్ షాపు లు అనధికారికంగా నిర్వహిస్తున్నారంటే ఎక్సైజ్ అధికారులు ఎంత పకడ్బందీగా విధులు నిర్వహిస్తున్నారో అర్థమవుతోంది. అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ వైన్ షాప్ యజమానులకు వంత పాడటంతో వారు రోజుకో లక్ష రూపాయలను వెనుకేసుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. మండల కేంద్రంలోని వైన్ షాపును నిర్వాహకులు లక్షలు వెచ్చించి దక్కించుకున్నారంటేనే అర్థమవుతోంది. వైన్ షాపుల్లో మద్యం దందా ఏ స్థాయిలో జరుగుతుందో అని పలువురు చర్చించుకుంటున్నారు.

## అందుబాటులో విదేశీ మద్యం..

ప్రముఖ మెట్రో నగరాల్లో కూడా లభ్యం కానీ విదేశీ మద్యం తాడిచెర్లలో లభిస్తుండటం పలువురిని విస్మయానికి గురి చేస్తోంది. గ్రామాల్లో బెల్ట్ షాపులు రాత్రి పగలు తేడా లేకుండా నడుస్తుండటంతో ఎన్నో కుటుంబాలు చిన్నా భిన్నం అవుతున్నాయి. తాగిన మత్తులో బెల్ట్ షాప్ ల వద్ద మాట మాట పెరిగి గొడవలు సైతం జరుగుతున్నాయి. బెల్ట్ షాపు లకు చేరిన మద్యంపై ఎటువంటి నిఘా లేకపోవడంతో కల్తీ మద్యం సైతం విక్రయిస్తూ మద్యం ప్రియుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తరుచూ గుడుంబా స్థావరాలపై దాడులు చేస్తున్న ఎక్సైజ్ అధికారులకు పక్కనే ఉన్న బెల్ట్ షాపులు కనపడకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో బెల్ట్ షాప్ దందాని అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

---

# నిబద్ధతతో ఎన్నికల విధులు నిర్వర్తించాలి

**జిల్లా ఎన్నికల అధికారి, పి.ప్రావీణ్య**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లా నోడల్ అధికారులు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణితో కలసి జిల్లా నోడల్ అధికారులతో ఎన్నికల ప్రవర్తన నియమావళి, అనుమతులు, ఎంసీఎంసి, ఫిర్యాదుల పరిష్కరణ, అక్రమ డబ్బు, నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు, పోస్టల్ బ్యాలెట్, బ్యాలెట్ పేపర్ నిర్వహణ, ఎన్నికల సిబ్బంది నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన ప్రతి అంశంపై నోడల్ అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి ఏప్రిల్ 25 వరకు వరంగల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ దృష్ట్యా కావలసిన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా నోడల్ అధికారులు సంబంధిత అంశాలపై ప్రతిరోజు నిర్ణీత నమూనాలో నివేదికలు సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డీఆర్ డీఓ కౌసల్య దేవి, డీపీఓ కల్పన, జెడ్పీసీఈవో రామిరెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారి బాలకృష్ణ, డీబీ సీడీఓ పుష్పలత, డీఎస్ టీడీఓ సౌజన్య తదితర నోడల్ ఆఫీసర్లు కలెక్టరేట్ పరిపాల అధికారి శ్రీకాంత్, ఎన్నికల పర్యవేక్షకులు విశ్వ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలన్స్ బృందాల పాత్ర కీలకం..

ఎన్నికలలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలన్స్ బృందాల పాత్ర అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని ఉప జిల్లా ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఆమె జిల్లాలోని ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి, వీడియో సర్వేలెన్స్ టీమ్, వీడియో వ్యువింగ్ టీమ్ లతో ఎన్నికల విధి విధానాల గురించి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా నోడల్ అధికారులు రామ్ రెడ్డి, సంజీవరెడ్డి, పుష్పాలత, ఎస్ టి ఎస్ ఎస్ టి, వి ఎస్ టి, వివి టి బృందాలు, తదితరులు పాల్గొన్నారు.

---

# నాలాల్లో డీ సిల్టింగ్ చేపట్టండి

**బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నాలాల్లో డీ సిల్టింగ్ ప్రక్రియ చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని బల్దియ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా సోమవారం నగర పరిధిలోని పద్మాక్షి కాలనీ రోడ్, శ్యాయంపేట, బొంది వాగు నాలా, రైల్వే ట్రాక్ అవతలి వైపు గల ప్రాంతం, మేదరి వాడ, రైల్వే ట్రాక్ వెంట్స్ ప్రాంతం, కీర్తి బార్ ఏరియా, శాకరాసి కుంట, జన్మభూమి జంక్షన్, మైసయ్య నగర్, శివ నగర్ స్మశాన వాటిక ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి అక్కడి స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా పద్మాక్షి కాలనీ శాయంపేట వద్ద కాంట్రాక్టర్ నిలిపివేసిన స్మార్ట్ సిటీ రోడ్డు పనులను పరిశీలించిన కమిషనర్ వెంటనే అట్టి పనులను కొనసాగించేలా చూడాలని ఎస్ ఈ ని ఆదేశించారు. అనంతరం వరంగల్ నగర పరిధి బొంది వాగు నాలా ను పరిశీలించి వరద ప్రభావం వల్ల ఎదురయ్యే సమస్యలను అధికారులను అడిగి తెలుసుకొన్నారు. డీ సిల్టింగ్ ప్రక్రియ ప్రారంభించి నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. కీర్తి బార్ నుంచి గవిచర్ల క్రాస్ రోడ్డు వరకు సుమారు మూడు కిలో మీటర్ ల మేర నిర్మిస్తున్న స్మార్ట్ రోడ్డు పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. జన్మ భూమి జంక్షన్ సమీపంలో డ్రైన్ ను పరిశీలించిన కమిషనర్ డ్రైన్ లో పేరుకు పోయిన చెత్తను తొలగించాలని సీఎంహెచ్ ఓ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర సీఎంహెచ్ ఓ డాక్టర్ రాజేష్, ఈఈ శ్రీనివాస్, డీఈలు రవి కిరణ్, రంగారావు, శానిటరీ సూపర్ వైజర్ సాంబయ్య, ఏఈలు సతీష్ హాబీబ్, మొజామిల్, శానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్‌లపై అవగాహన అవసరం..

లోక్ సభ ఎన్నికల నిర్వహణ వేళా నామినేషన్ ల సమర్పణపై అవగాహన అవసరమని ఏఆర్ఓ, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అభిప్రాయపడ్డారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో 106-వరంగల్ (తూర్పు) నియోజక వర్గ పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నామినేషన్ ల దాఖలుపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు మహమ్మద్ ఇక్బాల్ నాగేశ్వరరావుతో పాటు పార్టీల ప్రతినిధులు జన్ను అనిల్ (బీఎస్ పి), రవి (బిఆర్ఎస్), బాకం హరిశంకర్ (బీజేపీ), దాసరి రాజేష్ (కాంగ్రెస్) తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలి

## పరకాల కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కాళీ ప్రసాద్



**వరంగల్ వాయిస్, పరకాల :** వరంగల్ పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని పరకాల కాంటెస్టెంట్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు పిలుపునిచ్చారు. సోమవారం పరకాల పట్టణంలో బూత్ విజయ సంకల్పయాత్రలో పాల్గొని బీజేపీకి ఓటు వేయాలని ప్రచారం చేశారు. పరకాల పట్టణ బీజేపీ అధ్యక్షుడు మార్త భిక్షపతి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కాళి ప్రసాద్ మాట్లాడుతూ భారతదేశానికి ఒక మూల స్తంభంగా ఉన్న బీజేపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలంటే పరకాల నియోజకవర్గం 239 బూత్ లలో అధ్యక్షులు, కోఆర్డినేటర్స్, కార్యకర్తలు ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి మోడీ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. బీజేపీ గెలిచిన తర్వాత ప్రజలకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందిస్తామో ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా ప్రచారం చేయాలని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ బీజేపీకికి ఓటు వేసి గెలిపిస్తామని భరోసా ఇస్తున్నారని అన్నారు. నరేంద్ర మోడీ 140 కోట్ల ప్రజలే నా కుటుంబమని అనే వ్యక్తి అని, నిఖార్సైన దేశభక్తుడని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ ల పేరుతో ప్రజలను మోసం చేసిందని, ఇప్పటివరకు రుణమాఫీ, రైతుబంధు రూ.15000, పెళ్లైన జంటలకు తులం బంగారం, ఆసరా పెన్షన్, గృహలక్ష్మి ఎన్నో చెప్పి ఒకటి కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్, దేవునూరి మేఘనాథ్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించేవి ఈ ఎన్నికలని, బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శులు గాజుల నిరంజన్, కుక్కల విజయ్, ఉపాధ్యక్షుడు సంగ పురుషోత్తం, కోశాధికారి మంతెన సంతోష్, బూత్ అధ్యక్షులు వెల్దండి హేమంత్, మరాఠీ నర్సింగా రావు, ముత్యాల దేవేందర్, దామ సతీష్, బిరం రాజీ రెడ్డి, సాదు ప్రణయ్, పెండేల రామకృష్ణ, తడక విక్రం, చిదిరిక అశోక్, ఒంటేరు వీరేశ్, బొచ్చు సాంబమూర్తి, బొచ్చు శ్రీనివాస్, బొచ్చు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత బిడ్డను అవమానించిన చల్లా



**వరంగల్ వాయిస్, పరకాల :** దళితులు పార్టీ అధ్యక్షులుగా ఉండకూడదా.. ఒక దళిత బిడ్డ రెండు సంవత్సరాలుగా పార్టీకి బలోపేతం చేసుకుంటూ అన్ని వర్గాలను కలుపుకుపోతుంటే కొందరి నాయకుల చెప్పుడు మాటలు వింటూ మంచి నాయకులను దూరం చేసుకుంటున్నారని, కారణం చెప్పకుండా సస్పెండ్ చేయడం సబబా అని బహుజన విద్యార్థి సంఘం కేయూ ఇంచార్జి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ ఆరోపించారు. డాక్టర్ మడికొండ శ్రీను చేసిన తప్పు ఏమిటో చెప్పకుండా సస్పెండ్ చేయడం నీ రెడ్డి అహంకారానికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై మండిపడ్డారు. మళ్లీ దళిత బిడ్డను అవమానించిన నీకు రాజకీయ శూన్యమేనని అన్నారు. దళితులకు ఒక న్యాయం రెడ్లకు ఒక న్యాయమా అంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని కలిసిన కంది శ్రీనివాస్ రెడ్డి, బుచ్చి రెడ్డి, ఏనుకతల రవీందర్ లను ఎందుకు సస్పెండ్ చేయలేదన్నారు. ముందు నుంచే దళితుల అంటే ధర్మారెడ్డికి గిట్టదన్నారు. ఇంతకుముందు దళితులను అవమానిస్తే మొన్న జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో ప్రజలు, దళితులు నీకు బుద్ధి చెప్పారు. అయినా నీ బుద్ధి మారలేదు. రాబోయే రోజుల్లో ఇదే దళితులు నీకు రాజకీయంగా పుట్టగతులు లేకుండా చేస్తారని బొట్ల మనోహర్ అన్నారు.

## ఘనంగా గండె వెంకన్న జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, పరకాల :** బీఆర్ఎస్ నాయకులు, పరకాల కుంకుమేశ్వర స్వామి దేవాలయ మాజీ చైర్మన్ గండె వెంకన్న జన్మదిన వేడుకలు పరకాల పట్టణ బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం చల్లా ధర్మారెడ్డి వెంకన్నను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ప్రజలకు భద్రత, భరోసాకు ఫ్లాగ్ మార్చ్

### చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్




**వరంగల్ వాయిస్, రేగొండ :** ప్రజల్లో ఎన్నికల పట్ల ఆత్మ విశ్వాసం కలిగించేందుకే కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్ అన్నారు. ప్రజలు తమ ఓటు హక్కు నిర్భయంగా వినియోగించుకోవాలని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లా ఎస్పీ కిరణ్ ఖారే ఆదేశాల మేరకు రేగొండ మండలంలోని రూపిరెడ్డిపల్లి, చెన్నాపూర్, చిన్నకొడెపాక గ్రామాల్లో రేగొండ ఎస్ఐ ఎన్.రవికుమార్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించగా ముఖ్యఅతిథిగా చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ రానున్న లోక్ సభ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా, ప్రజలు తామ ఓటు హక్కు వినియోగించుకునేలా వారిలో నమ్మకం, భరోసా భద్రత కలిగేలా కేంద్ర సాయుధ బలగాలచే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని అన్నారు. సీఆర్పీఎఫ్ బెటాలియన్ సీఐ వీర్ పాల్ సింగ్ ఆధ్వర్యంలో దాదాపు 50మంది పోలీసు బలగాలచే గ్రామాల్లో పురవీధుల కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎన్ రవికుమార్, సెకండ్ ఎస్ఐ శ్రీలత, హెడ్ కానిస్టేబుల్ లింగమూర్తి, కానిస్టేబుల్ సాట్ల ప్రవీణ్, కిరణ్ సింగ్, పోలీసులు కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నారు.

## అరూరి రమేష్ గెలుపు ఖాయం



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పెంచికలపేట గ్రామంలో భారతీయ జనతా పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి ఆరూరి రమేష్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి స్టేట్ కౌన్సిల్ మెంబర్ మండల కోఆర్డినేటర్ మేకల రాజవీరు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని వివరించారు. అలాగే దేశ ప్రజలందరూ ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నటువంటి అయోధ్యలో రామ మందిర నిర్మాణం, 370 ఆర్టికల్ రద్దు, ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. కాబట్టి, అన్ని వర్గాల ప్రజలు ఈసారి జరిగే పార్లమెంటు ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి అరూరి రమేష్ కమలం పువ్వు గుర్తుకు అత్యధికంగా ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి, ఓబీసీ జిల్లా కార్యదర్శి సముద్రాల రవి, బూత్ అధ్యక్షులు మంగ మల్లికార్జున్, కొలగాని సుధాకర్, ఇలసరపు రత్నాకర్ పాల్గొన్నారు.

## అచ్చ సుదర్శన్‌కు అంబేద్కర్ లైఫ్ టైం అచీవ్ మెంట్ అవార్డు



**వరంగల్ వాయిస్, నడికూడ :** నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న అచ్చ సుదర్శన్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డును ఆన్ లైన్ ద్వారా అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ లోని అంతర్జాతీయ గుర్తింపు పొందిన స్వచ్ఛంద సంస్థ అయినటువంటి మనం ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ చక్రవర్తి ఈ అవార్డును అచ్చ సుదర్శన్ కు అందజేశారు. అచ్చ సుదర్శన్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా 27 సంవత్సరాలుగా పనిచేస్తూ బడుగు ,బలహీన వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు విద్య అందిస్తున్న సందర్భంగా అతని సేవలను గుర్తించినటువంటి మనం ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ చక్రవర్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పీఆర్టీయూ హనుమకొండ జిల్లా శాఖ అధ్యక్షుడు మందల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి, పాఠశాల ఉపాధ్యాయులు పోలంపల్లి విజేందర్ రెడ్డి, నిగ్గుల శ్రీదేవి, అంగన్వాడీ టీచర్స్ భీముడి లక్ష్మి, నందిపాటి సంధ్యా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ కట్ల రమ, విద్యా వాలంటీర్లు పర్షవేని జ్యోతి, బాబురావు, ఐఆర్పీ రమేష్, విద్యార్థిని విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# కాంగ్రెస్ హామీలను వెంటనే అమలు చేయాలి

## ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ధాన్యానికి క్వింటాలుకు రూ. 500లతో పాటు అన్ని రకాల వ్యవసాయ పంటలకు బోనస్ ఇస్తామని ప్రకటించిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత దాని ఊసే ఎత్తడం లేదని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి మండిపడ్డారు. మహబూబాబాద్ లో శనివారం జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి అధ్యక్షత వహించిన భిక్షపతి ప్రసంగిస్తూ గత ప్రభుత్వం రైతు రుణమాఫీని అమలు చేయకుండా ఐదు సంవత్సరాల కాలం సాగదీసిందని, రెండు లక్షల రూపాయల వరకు రైతుల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు దాని అమలుకు పూనుకోలేదన్నారు. దేశంలో కొనసాగుతున్న రైతు వ్యతిరేక విధానాలతో సేద్యం కుంటుపడే పరిస్థితి వచ్చిందని, వ్యవసాయ రంగానికి చేయూతనిచ్చి రైతాంగాన్ని ఆదుకోక పోతే దేశం ప్రమాదంలో పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు పాలక పార్టీలు వ్యవసాయ రంగానికి రైతాంగానికి, ఇచ్చిన హామీలను సైతం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా నమ్మకద్రోహానికి పాల్పడటం ఆనవాయితీగా మారిందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వాల సహాయ సహకారాలు లేకుండా వ్యవసాయం ముందుకు సాగదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతనిచ్చి వ్యవసాయ రంగాన్ని కాపాడాలని కోరారు. ఇప్పటికైనా రైతాంగానికి అప్పుల ఊబి నుంచి బయటపడడానికి రైతురుణ మాఫీ చట్టంచేయటం తోపాటు మద్దతు ధరను అందించడానికి పూనుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బోనస్సు రైతు రుణమాఫీ తో సహా ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే అమలు చేయాలని సమగ్ర వ్యవసాయ ప్రణాళికను రుణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జడ సత్యనారాయణ, యదల్లపల్లి సత్యం, సహాయ కార్యదర్శి గౌని ఐలయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాచర్ల బాలరాజు, బానోతు ఊక్లా, బూర్క వెంకటయ్య, ఎం.గిరి తదితరులు పాల్గొన్నారు.

# బహుజన్ సమాజ్ పార్టీలో చేరిన పంజా కల్పన



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ కేంద్రానికి చెందిన పంజా కల్పన సోమవారం తన అనుచర గణంతో హైదరాబాద్ లోని స్థానిక రాష్ట్ర బహుజన్ సమాజ్ పార్టీ కార్యాలయంలో పార్టీలో చేరారు. బహుజన్ సమాజ్ పార్టీ సెంట్రల్ కోఆర్డినేటర్ బాలయ్య, రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ కల్పనకు పార్టీలోకి మర్యాదపూర్వకంగా ఆహ్వానించి పార్టీ కండువా కప్పి సభ్యత్వం అందించి పార్టీలో స్వాగతిస్తూ ఆమెతో పాటు వారి అనుచర గణాన్ని కూడా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా పార్టీ సెంట్రల్ కోఆర్డినేటర్ బాలయ్య, రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ లు సంయుక్తంగా మాట్లాడుతూ బహుజన్ సమాజ పార్టీ సబ్బండ కులాల సంక్షేమం కోసం ఉద్యమిస్తూ ప్రజా సంక్షేమే ధ్యేయంగా పనిచేస్తుందని తెలిపారు. సమా సమాజ స్థాపన కేవలం బహుజన్ సమాజ్ పార్టీ వల్లనే జరుగుతుందని పేర్కొంటూ బహుజన్ సమాజ పార్టీ ప్రజాహితం కోసం చేపట్టే ప్రజా కార్యక్రమాలను చూసి పార్టీలో చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారికి భవిష్యత్తులో మంచి పదవులు లభిస్తాయన్నారు. అదే విధంగా నూతనంగా పార్టీలో చేరిన పంజా కల్పన మాట్లాడుతూ పార్టీ చేపట్టే ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితురాలై పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు. వరంగల్ జిల్లాలో, చుట్టుపక్కల మండలాల్లో పార్టీ బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. నన్ను ఆదరించి పార్టీలోకి స్వాగతించిన సెంట్రల్ కోఆర్డినేటర్ బాలయ్యకు, రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ కు, మహబూబాద్ జిల్లా అధ్యక్షుడు సింగారపు రాజుకు, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి దార్ల శివరాజ్ లకు, బహుజన సమాజ్ పార్టీ ముఖ్య నాయకులకు, కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. బహుజన సమాజ్ పార్టీలో చేరిన వారిలో మంద పూర్ణ, మహమ్మద్ అష్రఫ్, జవ్వాజీ యాకయ్య, పంజా సమ్మయ్య, వంగపల్లి గౌరీ శంకర్, వంగపల్లి దీపక్, పానుగంటి రాధిక, బందెల కవిత, బందెల మహేష్, అబ్బోజు వంశీ, గుండు స్టీఫెన్, వందేపురి లక్ష్మణ్, పెండ్లి రాజు తదితరులు ఉన్నారు.

## ఓటు హక్కే కాదు.. మన బాధ్యత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఓటు హక్కే కాదు ...మన బాధ్యత.. అంటూ బాలసముద్రం కూరగాయల మార్కెట్లోని మహిళలు ప్రేరణ ఫౌండేషన్ అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ 30 రోజులపాటు నిర్వహిస్తున్న ఓటు అవగాహన నాల్గవ రోజు కార్యక్రమంలో పాల్గొని కూరగాయల వర్తక మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజున ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటు హక్కు తమ బాధ్యతగా మహిళలందరూ కుటుంబ సభ్యులతో కలిసి ఆ రోజు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. మహిళలతో కలిసి ర్యాలీగా మార్కెట్ అంతా తిరుగుతూ ప్లకార్ట్స్ తో ప్రదర్శన నిర్వహించారు.

## ఫార్మసిస్టు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పున్నం శ్రావణ్



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండలంలోని రంగయ్య పల్లె గ్రామానికి చెందిన పున్నం శ్రావణ్ ను ఫార్మసిస్టు సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిని సత్యనారాయణ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా నియమించబడిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఫార్మసిస్టు సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుణ్ణం శ్రావణ్ మాట్లాడుతూ రిజిస్టర్ ఫార్మసిస్ట్ ల సంక్షేమానికి, వారి ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కృషి చేస్తానని తెలిపారు. ఫార్మసీ చట్టాలు అమలుకు, రిజిస్టర్ ఫార్మసిస్ట్ ల హక్కులు, ప్రజారోగ్య రక్షణకు తోడ్పాటు అందిస్తానన్నారు. ఈ సందర్భంగా తనను ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘానికి జిల్లా అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కడియం కావ్యకు మాదిగ సంఘాల ఫ్రంట్ మద్దతు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** మాదిగ సంఘాల ఫ్రంట్ మాదిగల హక్కుల దండోరా టీఎంహెచ్డీ, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి టీ ఎమ్మార్పీఎస్, జన్ను కనకరాజ్, ఈటిక రాజు ఆధ్వర్యంలో కాజీపేట పట్టణంలోని మీడియా పాయింట్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యకే తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని ప్రకటించారు. 100 రోజుల్లో ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ చేస్తామని బీజేపీ ప్రభుత్వం మాదిగలకు హామీ ఇచ్చి పది సంవత్సరాలుగామోసం చేసిందని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలను మరోసారి మోసం చేయడానికి వస్తున్నారన్నారు. దళితుల వ్యతిరేక పార్టీ బీజేపీకి మందకృష్ణ మాదిగ ఏ విధంగా మద్దతు తెలుపుతున్నారో తెలియజేయాలన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామని బహిరంగంగా చెబుతున్న బీజేపీని, పార్టీ అభ్యర్థులను ఓడించాలని మాదిగ ప్రజలను కోరుతున్నామన్నారు. ఈ ఎన్నికల్లో మాదిగలకు పార్లమెంట్ స్థానాలను ఇవ్వకపోవడానికి మందకృష్ణ మాదిగ కారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎంహెచ్డీ అధ్యక్షుడు వేముల బలరాం, టీఎంహెచ్డీ రాష్ట్ర అధ్యక్షుడు కోరిపల్లి శ్రీనివాస్, టీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు సిరిసినోల్ల బాలరాజు, శ్రావణ్ కుమార్, బీవీ రమణ, గన్నారపు సంగీత్ కుమార్, ఇల్లందు సమ్మయ్య, బోడ రాము, ప్రసాద్, నరేందర్, భీమ్ రాజ్, మహేష్, ఐలోని బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చలివేంద్రం



**వరంగల్ వాయిస్, సుబేదారి:** హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం సుబేదారి రెడ్ క్రాస్ సొసైటీ ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చైర్మన్ డాక్టర్ పి. విజయ్ చందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ పి. విజయ్ చందర్ రెడ్డి మాట్లాడుతూ మండుటెండల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంతం ప్రజలు వివిధ పనుల్లో బయటకు వచ్చిన సందర్భంలో మంచినీటి కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చలివేంద్రం ఉపయోగం పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రెడ్ క్రాస్ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణు గోపాల్, డాక్టర్ యం. శేషుమాదవ్, రెడ్ క్రాస్ డాక్టర్లు డా.జె.కిషన్ రావు, రిటైర్డ్ ఇంజినీర్ సత్యనారాయణ రావు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాటసారులకు మజ్జిగ పంపిణీ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కాశిబుగ్గ లక్ష్మీ గణపతి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రంలో భాగంగా రెండవ రోజు సతీష్–హేమ దంపతులు పెళ్లిరోజు సందర్భంగా బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వంగరి రాంప్రసాద్, కోశాధికారి దుస్స కృష్ణ , సహాయ కార్యదర్శి మండల చంద్రశేఖర్, గౌరవసలహాదారులు వంగరి రవి, బండారి రాజేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ములుక సురేష్, కోట నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక కాలనీ నూతన కమిటీ సమావేశం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని గోపాలపురంలో నూతన కమిటీ సమావేశం అధ్యక్షుడు పల్లెబోయిన కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకతీయ యూనివర్సిటీ సబ్ ఇన్ స్పెక్టర్ దామరూపాల దేవేందర్ హాజరయ్యారు. నూతన కమిటీకి తెలియజేస్తూ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గత మూడు సంవత్సరాల నుంచి దిగ్విజయంగా ఒక కుటుంబ పాలనగా అభివృద్ధి చేసుకుంటూ వచ్చిన పాత కమిటీ సభ్యులు, గౌరవ అధ్యక్షులు ఆరె రాకేష్ రెడ్డి, అధ్యక్షుడు కోరిక రామ్ సింగ్ నాయక్, ప్రధాన కార్యదర్శి తంగేళ్ల రవి ప్రసాద్, కోశాధికారి పొన్నోజు శ్రీనివాస్, మిగతా కమిటీ సభ్యులకు కొత్త కమిటీ సన్మానం చేయడంతో పాటు కాలనీ వాసులు అందరూ కలిసి ఎస్సై కి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బంక సురేందర్, కోశాధికారి పోచంపల్లి రమేష్, లక్ష్మణ్, రవీందర్, తిరుపతిరెడ్డి, బజన్ నాయక్, భాస్కర్, మధుసూదన్, వెంకన్న, రవి, సంతోష్, రమణాకర్, రాజేందర్, విజేందర్ రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

## వరంగల్ పార్లమెంట్ సెగ్మెంట్ ఇంచార్జిగా సందుపట్ల ధన్ రాజ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ సందుపట్ల ధన్ రాజ్ ని వరంగల్ పార్లమెంట్ సెగ్మెంట్ ఇంచార్జిగా నియమిస్తూ ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సందుపట్ల ధన్ రాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నూతి శ్రీకాంత్ గౌడ్ కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం కృషి చేస్తానని ధన్ రాజ్ తెలిపారు.

## గ్యాస్ సిలిండర్ పథకంపై రాయితీ డబ్బుల విడుదల



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ. 500 కు గ్యాస్ సిలిండర్ పథకాన్ని దాదాపు 18 లక్షల మంది వినియోగించుకున్నారని, ఏప్రిల్ 13 నాటికి కొందరు రెండవ రాయితీ సిలిండర్ కూడా పొందడం కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావుల వెంకట రమేష్ గౌడ్ కొనియాడారు. ఈ సందర్భంగా సోమవారం రావుల వెంకట రమేష్ గౌడ్ మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ పథకం ద్వారా మొత్తం 28.29 లక్షల మందికి 59.97 కోట్ల సబ్సిడీ వచ్చిందని, రాష్ట్రవ్యాప్తంగా 39.33 లక్షల మంది గ్యాస్ వినియోగదారులు 500కు సిలిండర్ పథకానికి అర్హులుగా కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించిందన్నారు. గ్యాస్ సిలిండర్ పథకం పై రాయితీ డబ్బులు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వెంకట రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

### జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలకు సంబంధించిన 22 దరఖాస్తులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించుటకు సంబంధిత శాఖలకు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతతో వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శాఖల వారీగా పెండింగ్ లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీజేపీ మోడి ప్రభుత్వం 10 సంవత్సరాలలో సాధించిన ప్రగతి మణిపూర్ లో జరిగిన మారనకాండలో 173 మందిని బలిగొనడమా, ఇది ప్రజాస్వామ్యమా, ఇది మోడీ పరిపాలనకు నిదర్శనమా అని ఉమ్మడి జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బొల్లు రమేష్ కుమార్ ముదిరాజ్ విమర్శించారు. మోడీ నిరంకుశత్వ పాలన నాటి బ్రిటిష్ పరిపాలనను మైమరిపించే రీతిలో మహిళా రెజరర్లను అవమానించడం మరిపోలేని సంఘటన అని తెలిపారు.. రైతుల నిరసనను దేశద్రోహంగా ముద్ర వేయడం, ఉగ్రవాది గాడ్సేను బహిరంగంగా కీర్తించి ఆరాధించడమే దేశం సాధించిన ప్రగతా అని ప్రశ్నించారు. ఈ మధ్యలో తాను మాత్రమే శ్రీరామ భక్తుడైనట్టు రామ మందిరాన్ని తానే నిర్మించినట్టు ప్రజలను మభ్యపెట్టి ముచ్చటగా మూడోసారి హిందూ మతాన్ని అడ్డుపెట్టుకొని గద్దెనెక్కాలని చూస్తున్నాడని విమర్శించారు. కాబట్టి, విజ్ఞులైన దేశ ప్రజలు ఈ మోసపూరితమైన బీజేపీ వాగ్దానాలను తిప్పికొట్టేలా రానున్న పార్లమెంటు ఎలక్షన్లలో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

## బీసీ డిమాండ్ల ప్రస్తావనే లేని బీజేపీ ఎన్నికల ప్రణాళిక

### తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రానున్న లోకసభ ఎన్నికల కోసం బీజేపీ ప్రకటించిన ఎన్నికల ప్రణాళికలో బీసీల డిమాండ్ల ప్రస్తావనే లేదని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. దేశవ్యాప్తంగా బీసీ కులగణనజరగాలని చట్టసభలలో బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించాలని ఉద్యమాలు జరుగుతున్నా, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు శాసనసభలలో తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించినా పట్టించుకోని ప్రధాని నరేంద్ర మోడీ తమ పార్టీ ఎన్నికల ప్రణాళికలో కూడా ఈ అంశాలు ప్రస్తావించ లేదంటే బీసీల డిమాండ్ల పై ప్రభుత్వానికి ఉన్న వైఖరి ఏమిటో స్పష్టమవుతుందన్నారు. బీసీ ప్రధానమంత్రినని చెప్పుకునే నరేంద్రమోడీ తన పాలనలో బీసీలకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. రానున్న ఎన్నికల్లో చైతన్యవంతులైన బీసీలు బిజెపికి తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈసారి ప్రకటించిన మేనిఫెస్టో కూడా మేడిపండు లాంటిదేనని, ప్రజా కంఠక పాలకులను ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని, వామపక్ష లౌకిక ప్రజాస్వామ్య శక్తులకు విజయాన్ని చేకూర్చేందుకు అన్ని వర్గాల ప్రజలు కృషి చేయాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

## రౌడీ షీటర్‌కు జీవిత ఖైదు, జరిమానా

**వరంగల్ వాయిస్, మడికొండ :** 2021 సంవత్సరం జులై 10న ఉదయం 5:30 గంటలకు సమయంలో రాంపేట గ్రామస్తుడు అలుపుల సమ్మయ్య , తన మనవడు సుప్రీత్‌తో వాకింగ్ కు మైసమ్మ కుంట వద్దకు వెళ్లగా కళ్లు మూసుకొని బండపై యోగా చేస్తుండగా రాంపేట్ గ్రామస్తుడైన దాడబోయిన శంకరయ్య పెప్పర్ స్ప్రే కొట్టి గొడ్డలితో తలపై, చేతులపై, కాళ్లపై నరికి చంపాడు. దీంతో అప్పటి ఇన్ స్పెక్టర్ ఎం.రవికుమార్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జెషీట్ దాఖలు చేశారు. ఈ కేసును డీసీపీ ఎండి బారీ, ఏసీపీ తిరుమల్ పర్యవేక్షణలో 13మంది సాక్షుల విచారణ అనంతరం నిందితుడిపై నేరం రుజువైనందున జీవిత ఖైదు, 5 వేల జరిమానాను విధిస్తూ జిల్లా జడ్జి ఎం కృష్ణమూర్తి తీర్పు చెప్పారు. ప్రస్తుతం మడికొండ ఎస్ హెచ్ఓ డి ప్రతాప్, ఎస్సైలు రాజబాబు, దివ్య, కోర్టు కానిస్టేబుల్ వి రాజేష్ సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం సత్యనారాయణ వాదించగా , లైసెన్ ఆఫీసర్ పరమేశ్వరి కేసులో సహకరించారన్నారు.

## ముచ్చటగా మూడోసారి ప్రధాని మోదీనే..

### బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** దేశంలో మూడోసారి బీజేపీ జెండా ఎగరటం ఖాయమని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని మూడో సారి కూడా మోదీయే దేశానికి ప్రధాని అవుతారని బీజేపీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి సీతారం నాయక్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయన పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మరిపెడ మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం డోర్నకల్ నియోజకవర్గ ప్రజలకు తనను గెలిపిస్తే చేయబోయే అభివృద్ధి పనులను గురించి మీడియా ముఖంగా వివరించారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం కలేనని, మరోమారు బీజేపీ గెలిచి తీరుతుందన్నారు. కాంగ్రెస్ కు ఓటేస్తే అభివృద్ధికి అడ్డుపడినట్లే అని మోదీతోనే దేశం అన్ని విధాల అభివృద్ధి జరుగుతుందన్నారు. అంతేకాకుండా ప్రస్తుత ఎంపీ కూడా ఈ ప్రాంతానికి పదవీ కాలంలో ఏదీ చేయలేదని, తాను ఎంపీగా ఉన్న కాలంలోనే అన్ని అభివృద్ధి పనుల చేశానని, ఇప్పటికి అవే పనులు తప్ప గత ఐదేళ్లుగా మరో అభివృద్ధి పని ఎంపీ తరపున జరగలేదని దుయ్యబట్టారు. అంతే కాకుండా డోర్నకల్ ప్రాంతంలో గిరిజనుల కోసం కళాశాలలు, పాఠశాలల ఏర్పాటుకు కృషి చేశానని, తన హయాంలోనే బాలికల వసతి గృహాలకు అన్ని రకాల వసతులు, బాలికల విద్యకు పెద్ద పీట వేస్తూ బాలిక వసతి గృహాలు నెలకొల్పటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారపు వెంకన్న, బీజేపీ డోర్నకల్ బాధ్యులు భూక్య సంగీత, భూక్య కాంతమ్మ, మండల అధ్యక్షుడు కత్రోతు గంగాచారి, టౌన్ అధ్యక్షుడు లింగయ్య, హుస్సేన్ నాయక్, సుధాకర్ నాయక్, జగన్ నాయక్, ఈవీ రమణ, భాస్కర్, బింగి రమేష్, ఆర్ జడ్ తదితరుల పాల్గొన్నారు.

## హిందూ మతోన్మాద బీజేపీని ఓడించండి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** హిందూ మతోన్మాద గుండాలచే హత్య చేయబడ్డ కామ్రేడ్ జార్జి రెడ్డి 52వ వర్ధంతి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సభను కార్యక్రమాన్ని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పీడీఎస్ యూ పూర్వ విద్యార్థుల వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఖిలా వరంగల్ పడమరకోట చమన్ సెంటర్ లో పీడీఎస్ యూ వరంగల్ ఉమ్మడి జిల్లా పూర్వ అధ్యక్షుడు రాచర్ల బాలరాజు అధ్యక్షతన జరిగింది. ముందుగా పూర్వ విద్యార్థి సంఘ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలతో చమన్ సెంటర్ లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇరువురికి నివాళులు అర్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పీడీఎస్ యూ పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడైన తీగల జీవన్, పూర్వ రాష్ట్ర కార్యదర్శి బండి కోటేశ్వరరావు హాజరైన వారిని ఉద్దేశించి మాట్లాడారు. 52 సంవత్సరాల క్రితం ప్రగతిశీల ఉద్యమ నేత జార్జి రెడ్డిని ఉస్మానియా యూనివర్సిటీలో హత్య చేశారని, నేడు అదే దారిలో అనేకమంది ప్రజాసామికవాదులను హత్య చేశారని మోడీ ప్రభుత్వాన్ని విమర్శించారు. రాబోవు పార్లమెంటరీ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ రమేష్, బొడ్డు కుమార్ స్వామి, జి వెంకటేశ్వర్లు, బైరబోయిన ఐలయ్య, కేడల ప్రసాద్, గంద్రతి హరిబాబు, ఇనుముల కృష్ణ మోహన్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో 1 మే నుంచి 31 మే వరకు గ్రామీణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. ఈ శిక్షణ శిబిరాలకు క్రీడాకారులైన బాలబాలికలు అర్హులు. నెల రోజులపాటు హనుమకొండ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించబోయే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఉచితంగానే నిర్వహించబడునని, ఈ శిబిరాలు నిర్వహించుటకుగాను పీడీలు, పీఈటీలు లేదా అనుభవజ్ఞులైన (సీనియర్) క్రీడాకారులు ఈనెల 16 నుంచి 23 సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు ప్రతిరోజు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

### పట్టణ ప్రాంతాల్లో సైతం..

పట్టణ ప్రాంతాల్లో అనగా జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో వివిధ క్రీడాంశాలలో అనుభవజ్ఞులైన డీఎస్ఏ కోచ్ లు, అసోసియేషన్ క్రీడా సంఘాల సీనియర్ క్రీడాకారుల ద్వారా నిర్వహించనున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు ప్రతిరోజు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థిని, విద్యార్థులు ఈనెల 16 నుంచి 25 సాయంత్రం 5గంటల లోపు ఇండోర్ స్టేడియం, ప్రభుత్వ పాఠశాలలు/ కళాశాలలో హనుమకొండలో ఆధార్, బొనఫైడ్ సర్టిఫికేట్ తో దరఖాస్తు చేసువాలని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అధికారి గుగులోతు అశోక్ కుమార్ కోరారు. మరిన్ని వివరాలకు శ్రీమన్నారాయణ 9441086556, వి.నరేందర్: 9392015280, కే.ప్రశాంత్: 9949271564, కె.రమేశ్ 9849276234, ప్రభుదాస్ 9642963577, ఎండీ.అఫ్జల్ 9010002889, బి.విష్ణువర్ధన్ 7386469301, ఓ.శంకర్ 8008469219, కె.రాజు 9182854789, బి.జీవన్ 9440529916, పి. వెంకటేశ్వర్లు 9010684926 నెంబర్ లో సంప్రదించాలని సూచించారు.

## ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి. శ్రీజ , సీహెచ్ మహేందర్ జిలతో కలిసి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి ప్రజలు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ రోజు ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం (11) దరఖాస్తులు రాగా ఆయా దరఖాస్తులను సంబంధిత శాఖ అధికారులకు పరిష్కరణ నిమిత్తం సిఫారసు చేశారు. ప్రజల నుంచి వారం వారం స్వీకరించిన దరకాస్తులలో పరిష్కరించేందుకు వీలుకానీ పక్షంలో దరఖాస్తుదారునకు అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేస్తూ ప్రజావాణి పోర్టల్ లో పెండింగ్ దరఖాస్తులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ సంబందిత శాఖల అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కె. సత్య పాల్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

## డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. వెంకటరమణ వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరిలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పర్యవేక్షించారు. మాట్లాడుతూ జిల్లాలో ఎండ తీవ్రత, వేడి గాలులు వీచడం పెరుగుతున్నదని, దీంతో వడదెబ్బ తలగకుండా ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎవరైనా సరే వడదెబ్బకు గురైనప్పుడు ముఖ్యంగా శరీర ఉష్ణోగ్రత తీవ్రంగా పెరగడం, తీవ్రమైన తలనొప్పి, నాలుక ఎండిపోవడం, శరీరంలో నీటి శాతం కోల్పోవడం, మూత్రం గాఢ పసుపు రంగులో ఉండి మంట రావడం, పాక్షికంగా లేదా పూర్తిగా అపస్మారక స్థితిలోకి వెళ్లేలా లక్షణాలు కనిపిస్తాయన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడ ఉన్న ప్రదేశానికి చేర్చి, శరీరాన్ని చల్లని నీటిలో తడిపిన గుడ్డతో తుడవాలని సూచించారు. అదే విధంగా ఎండ దెబ్బ తలిగిన వారికి ఉప్పుతో కలిపిన మజ్జిగ, చల్ల, కొబ్బరినీళు ౣ, నిమ్మరసం, గ్లూకోజు, ఓఆర్ఎస్ ద్రావణాన్ని త్రాగించి సత్వర చర్యల కోసం 108 అత్యవసర సేవలను సంప్రదించి ప్రథమ చికిత్స చేసిన తర్వాత దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. వడదెబ్బ తలగకుండా ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు బయట తిరగరాదని, పిల్లలు ఆటలు ఆడరాదని, తప్పని పరిస్థితిలో బయటికి వెళ్లవలసి వస్తే గొడుగు గాని, టోపీ గాని, తెల్ల రోమాలు గానీ తప్పక ధరించాలని కోరారు. నీరు ఇతర ద్రవపదార్థాలను ఎక్కువ తీసుకోవాలని తెలిపారు. మత్తు పానీయాలు తీసుకోరాదని ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు అనారోగ్యంతో బాధపడే వారు వేసవి కాలంలో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. వడదెబ్బ బాధితుల కోసం జిల్లావ్యాప్తంగా రెస్పాండ్ టీంలను 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ఏడు పట్టణ ఆరోగ్య కేంద్రాలలో, రెండు సామాజిక ఆరోగ్య కేంద్రాలలో,118 ఆరోగ్య ఉప కేంద్రాలలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మండల స్థాయిల్లో వైద్యాధికారితో పాటు తహసిల్దార్, సబ్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పర్యవేక్షిస్తారని, రెవెన్యూ డివిజన్లలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధర్ సింగ్, డిప్యూటీ డీఎంహెచ్ఓలు డాక్టర్ గోపాలరావు, డాక్టర్ ప్రకాష్ పర్యవేక్షించి ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా ప్రజలలో అవగాహన కల్పిస్తారని తెలిపారు. ప్రతి గర్భిణీ స్త్రీని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించేటట్లు చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఎవరైనా ప్రైవేట్ ఆస్పత్రుల వారు అనవసరమైన అబార్షన్ గానీ, సి సెక్షన్ ఆపరేషన్ గానీ చేసినట్లయితే వారి పైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సమయపాలన పాటించి సేవలందించాలన్నారు.

## తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా వేసవిలో త్రాగు నీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని వల్లెంకుంట గ్రామాన్ని సందర్శించి గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. వేసవిలో ఇంటింటికి సురక్షిత మంచి నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం కేడీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో విక్రమ్ కుమార్, కార్యదర్శి నరేష్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ తనిఖీ



**వరంగల్ వాయిస్, ములుగు :** లోక్ సభ 2024 ఎన్నికలలో భాగంగా కలెక్టరేట్ లో గల ఈవీఎం గోడౌన్ ను సోమవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరిష్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రాలతో కలిసి తనిఖీ చేశారు. ముందుగా గోడౌన్ సీల్ పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి ఈవీఎం, వీవీప్యాట్లు భద్రపరచిన గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరంతరం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గోడౌన్ పరిసర ప్రాంతాలలో పరిశు భ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవరిని గోడౌన్ పరిధి లోపలికి అనుమతించకూడదని అధికారులకు సెక్యూరిటీ, సిబ్బందికి సూచించారు. స్ట్రాంగ్ రూంలో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండాలని, అధికారులు సీసీ కెమెరాలను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసే ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం స్థలాన్ని పరిశీలించి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి. శ్రీజ, అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జి, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, డీఎస్పీ రవీందర్, తహసీల్దార్ లు విజయభాస్కర్, రవీందర్, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీకి ఓటమి తప్పదు



**వరంగల్ వాయిస్, సుబేదారి :** భారతీయ జనతాపార్టీ 2014లో ప్రకటించిన ఘోషనపత్రులో షైన్ ఇండియా అని ,ఇప్పుడు 2024లో ప్రకటించిన సంకల్ప్ పత్ర్వలో వికసిత్ భారత్ అని ప్రకటించి మోసం చేస్తున్నారని, ఈ పది సంవత్సరాల బీజేపీ పాలనలో కేవలం అదానీ, అంబానీలు మాత్రమే వికసించారని తెలంగాణ మైనారిటీ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అఖీల్ పాషా విమర్శించారు. సుబేదారి లోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న మహమ్మద్ అఖీల్ పాషా మాట్లాడుతూ నిన్న బీజేపీ ప్రకటించిన సంకల్ప్ పత్రూలో దేశాభివృద్ధికి సంబంధించిన ప్రణాళిక లేదని, దేశంలో పెరుగుతున్న నిరుద్యోగులకు భరోసా లేదన్నారు. దేశానికి వెన్నెముక లాంటి రైతుకు మద్దతు ధర గురించి ఊసే లేదనీ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా మేనిఫెస్టో ప్రకటించగానే ముస్లిం లీగ్ మేని ఫెస్టో అని ప్రకటించిన బీజేపీ ఇప్పుడు మనువాద సంకల్ప్ పత్ర ప్రకటించిందన్నారు. ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి ఓటమి తప్పదన్నారు. ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహ్మద్ మజహర్ హుస్సేన్ పాల్గొన్నారు.

## యర్ర మాద కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక, రాష్ట్ర అధ్యక్షుడు యర్ర మాద కృష్ణారెడ్డి 50వ జన్మదిన వేడుకలు సోమవారం వరంగల్ ఎస్ ఆర్ఆర్ తోట జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సాదుల పూర్ణచందర్ ఆధ్వర్యలో జరిగాయి. ముందుగా కేక్ కట్ చేసి స్వీట్ పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో నారాయణగిరి శ్రీనివాస్, గుటోజు వేణు, దొనికెల ప్రవీణ్ గౌడ్, శ్రీరాం మల్లేశం, తౌటం రమేష్, అబ్బనవేణి రాజు, స్వామి ప్రభ, బూట్ల నాగరాజు, గుర్రం సదానందం పాల్గొన్నారు.

## వినాయక పరపతి సంఘం అధ్యక్షుడిగా బత్తిని వీరభద్రయ్య




**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 42వ డివిజన్ లో రంగశాయిపేటలోని వినాయక పరపతి సంఘం అధ్యక్షుడు బత్తిని వీరభద్రయ్య అధ్యక్షతన 13వ సర్వ సభ్య సమావేశం, 26వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఖిలా వరంగల్ పీఏసీఎస్ అధ్యక్షుడు కేడల జనార్దన్ హాజరై మాట్లాడుతూ ఈరోజుల్లో కష్టాల విలువ తెలిసి సామాన్య సభ్యుడికి రూ.1 వడ్డీకి ఒక్క జమానతు అప్పు ఇచ్చి అవసరాలు తీర్చడానికి సహకరిస్తున్న వినాయక పరపతి సంఘం ఆదర్శనీయమన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం చేత ప్రమాణం చేయించారు. గౌరవ అధ్యక్షుడు వడ్లకొండ మల్లికార్జున్, అధ్యక్షుడిగా బత్తిని వీరభద్రయ్య, ఉపాధ్యక్షుడిగా అడుప ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కెడల మల్లేశం, సహాయ కార్యదర్శి పెరుమాండ్ల రమేష్, కోశాధికారి కోల రాము, సహాయ కోశాధికారి అడ్డగట్ల సంపత్, ముఖ్య సలహాదారులు కత్తి సాంబేశం, కత్తి కుమారస్వామి, కేడల జనార్దన్, విలాసాగరం శ్రీనివాస్ గౌడ్, పోశాల మల్లికార్జున్, కొల్లూరి యోగానంద్, ఆర్గనైజర్స్ బొమ్మెర కుమారస్వామి, మజ్జిగ జగన్, పాల రంజిత్, చిట్ల శ్యామ్, కార్యవర్గ సభ్యులు విలాసాగరం శ్రీధర్, వడ్లకొండ మహేష్, టీవీ రఘురాం, శంకేసి వెంకటేశ్వర్లు, పెరుమాండ్ల పరశురాములు ఎన్నికయ్యారు. ఆదాయ వ్యయాల విషయాలు అనుమాండ్ల రమేష్ చదువగా అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం స్వీట్స్ పంచి పెట్టారు. కోల రాము వందన సమర్పణ చేయగా గౌరవ సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి




**వరంగల్ వాయిస్, రాజన్న సిరిసిల్ల జిల్లా :** సిరిసిల్ల, జగిత్యాల ఎన్‌హెచ్ఎం ఆల్ క్యాడర్స్ సమావేశం సోమవారం కార్మిక భవన్ సుభాష్ నగర్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ ఎన్‌హెచ్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా హాజరయ్యారు. ఈ సమావేశం రాజన్న సిరిసిల్ల జిల్లా ఏఐటీయూసీ కడారి రాములు అధ్యక్షతన జరగగా జగిత్యాల జిల్లా ఎన్ హెచ్ఎం నాయకులు వెన్న మహేష్, సిరిసిల్ల జిల్లా ఎన్‌హెచ్ఎం నాయకురాలు రాణి, జగిత్యాల సిరిసిల్ల జిల్లాల ఎన్ హెచ్ఎం ఆల్ క్యాడర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఎన్ హెచ్ఎం ఉద్యోగులందరిని వెంటనే ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన కమిటీ వేయడం జరిగింది. జిల్లా అధ్యక్షురాలిగా బి వనిత, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రాణి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సాయికుమార్, జగిత్యాల జిల్లా అధ్యక్షురాలిగా గండ్ల మధురిమ, ప్రధాన కార్యదర్శి బి రజిత, వైస్ ప్రెసిడెంట్ అనురాధ, వైస్ ప్రెసిడెంట్ బడుగు శిరీష, ఆర్గనైజ్ ప్రెసిడెంట్ వడ్నాల చందు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది.

## ఈవో శేషగిరి, పూజారి రామాచారిలకు సన్మానం



**వరంగల్ వాయిస్, గీసుగొండ :** మండలంలోని కొమ్మాల జాతరను విజయవంతం చేసిన ఈవో శేషగిరికి, ప్రధాన పూజారి రామాచారికి జిల్లా కాంగ్రెస్ నాయకులు సాయిలి ప్రభాకర్, చాడ కొమరారెడ్డిలు కలిసి సన్మానం చేశారు. జాతరను విజయవంతం చేసిన పోలీసు అధికారులకు, విద్యుత్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత తొమ్మిది ఏళ్ల బీఆర్ఎస్ పరిపాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, అలాంటిది ప్రధానంగా ఎన్నడు లేని వివరంగా గెలిచిన రెండు నెలలకే స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి రూ. కోటి 30 లక్షలతో భక్తులకు రోడ్లు గానీ, టాయిలెట్స్ మంచినీటి వసతులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎప్పటికప్పుడు జాతరపై ఎమ్మెల్యే దృష్టి పెట్టి విజయవంతం చేశారు కాబట్టి, భక్తులు సంతోషంతో సకల సౌకర్యాలతో భగవంతుని దర్శనం చేసుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల్ నాయక్, కమిటీ డైరెక్టర్లు కందికొండ రాజు, లవుడియా రాజు, చెవుల నాయక్, వీరేందర్, మండల నరేష్, యార రాజిరెడ్డి, శ్రీనాథ్, తదితర డైరెక్టర్లు పాల్గొన్నారు.

# అమర్‌సింగ్ చంకీలకు మంచి స్పందన



ప్రముఖ పంజాబీ గాయకుడు అమర్ సింగ్ చంకీల 27 ఏళ్ల వయసులోనే హత్యకు గురైన సంగతి తెలిసిందే! ఆయన జీవితం ఆధారంగా 'అమర్‌సింగ్ చంకీల'చిత్రాన్ని తెరకెక్కించారు. ఇంతియాజ్ అలీ దర్శకత్వం వహించారు. బాలీవుడ్ నటుడు దిల్జిత్ దొసాంజ్, పరిణీతి చోప్రాప్రధాన పాత్రధారులు. ఏప్రిల్ 12న నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలైన ఈ చిత్రం విశేష ఆదరణ పొందుతోంది. ఈ చిత్రంలో ఆమె పోషించిన అమర్‌జోత్ కౌర్ పాత్రకు వస్తున్న స్పందన గురించి పరిణీతి స్పందించారు. అమర్ సింగ్ చంకీల' చిత్రానికి ప్రేక్షకుల నుంచి వస్తోన్న స్పందన చూస్తుంటే సంతోషంగా ఉంది. ఆనందంతో కన్నీళ్లు ఆగడం లేదు. పరిణీతి ఈజ్ బ్యాక్.. అనే మాటలు చాలా గట్టిగా వినిపిస్తున్నాయి. ఇంత స్పందన నేను ఊహించలేదు. అవును.. నేను తిరిగొచ్చేశా. ఎక్కడికీ వెళ్లను. సినీ ప్రేమికులు చూపిస్తున్న ప్రేమాభిమానాలకు మనసు నిండిపోయింది' ప్రియాంక చోప్రా సోదరిగా బాలీవుడ్‌లో అడుగుపెట్టిన నటి పరిణీతి చోప్రా 2011లో విడుదలైన 'లేడీస్ వర్సెస్ రికీ బహ్ల్'లో కీలక పాత్ర పోషించారు. ఆప్ యువ నాయకుడు రాఘవ్ చద్ధాను గతేడాది ఆమె వివాహం చేసుకొన్నారు. పెళ్లి తర్వాత సినిమాలకు స్వస్తి చెబుతారని అంతా భావించారు. కానీ తాజా పోస్ట్‌తో ఆ ఆ ఊహాగానాలకు చెక్ పెట్టారు.





## వారణాసిలో రణ్‌వీర్, కృతి సనన్

విలక్షణ నటనతో ఎంటర్‌టైన్ చేసే అతికొద్ది మంది బాలీవుడ్ యాక్టర్లలో ఒకడు రన్‌వీర్ సింగ్. అందం, అభినయం, స్టన్నింగ్ యాక్టింగ్‌తో ఇంప్రెస్ చేసే టాలెంట్ ఉన్న బ్యూటీ కృతిసనన్. ఈ భామ గురించి తెలుగు ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అవసరం లేదు. ఈ ఇద్దరు యాక్టర్లు ఒక్కచోట సందడి చేస్తే ఎలా ఉంటుంది. రన్‌వీర్, కృతిసనన్ పాపులర్ డిజైనర్ మనీశ్ మల్హోత్రా ఫ్యాషన్ షోలో థీమ్‌ను ప్రతిబింబించే కాస్ట్యూమ్స్‌లో ర్యాంప్ వాక్ చేసి ఔరా అనిపించారు. అనంతరం రన్‌వీర్‌సింగ్, కృతిసనన్ ప్రఖ్యాత పుణ్యక్షేత్రం వారణాసిలోని కాశీ విశ్వనాథ్ ఆలయాన్ని సందర్శించారు. రన్‌వీర్‌సింగ్, కృతిసనన్ వారణాసి సందర్శనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.



## శంకర్ కుమార్తె వివాహం

ప్రముఖ దర్శకుడు శంకర్ పెద్ద కుమార్తె ఐశ్వర్య వివాహం వేడుకగా జరిగింది. అసిస్టెంట్ డైరెక్టర్ తరుణ్ కార్తీక్ తో సోమవారం ఉదయం ఆమె ఏడడుగులు వేశారు. చెన్నైలో ప్రముఖ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఈ వివాహ వేడుకలో ఇరు కుటుంబాలు, సినీ ప్రముఖులు సందడి చేశారు. కమల్‌హాసన్, రజనీకాంత్, నయనతార – విఘ్నేశ్ శివన్ దంపతులు, సూర్య, కార్తి, నరేశ్ తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. దీనికి సంబంధించిన పలు ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. కొత్త జంటకు నెటిజన్లు అభినందనలు తెలుపుతున్నారు. వైద్యురాలైన ఐశ్వర్యకు ఇది రెండో వివాహం. 2021లో క్రికెటర్ రోహిత్‌తో ఆమె వివాహం జరిగింది. పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నారు. రోహిత్‌పై వచ్చిన పలు ఆరోపణల కారణంగానే ఆమె విడిపోయినట్లు కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం సాగింది. శంకర్ ప్రస్తుతం రెండు పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్నారు. కమల్ హాసన్ హీరోగా తెరకెక్కుతోన్న 'భారతీయుడు 2' జూన్‌లో విడుదల కానుంది. రామ్‌చరణ్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న 'గేమ్ ఛేంజర్' సెప్టెంబర్, అక్టోబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది.



## కల్కి విడుదలలో మరింత ఆలస్యం?

గ్లోబల్ స్టార్ హీరో ప్రభాస్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం కల్కి 2898 ఏడీ నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం సైన్స్ ఫిక్షన్ జోనర్‌లో తెరకెక్కుతోంది. ఈ చిత్రాన్ని ముందుగా ప్రకటించిన ప్రకారం మే 9న విడుదల చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే తాజాగా ఈ మూవీ మరో తేదీన రాబోతుందంటూ వార్తలు ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. తాజాగా కల్కి 2898 ఏడీ రిలీజ్ డేట్‌పై కొత్త అప్‌డేట్ బయటకు వచ్చింది. చిత్రీకరణ, పోస్ట్ ప్రొడక్షన్ పనుల ఆలస్య కారణంగా ఈ చిత్రాన్ని జులై 12న విడుదల చేయబోతున్నారంటూ వార్త వస్తోంది. మరి ఈ విడుదల తేదీపై మేకర్స్ నుంచి అధికారిక అప్‌డేట్ వస్తే క్లారిటీ వచ్చే అవకాశాలున్నాయి. వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై సీ అశ్వనీదత్ నిర్మిస్తున్న కల్కి 2898 ఏడీలో బాలీవుడ్ భామలు దీపికా పదుకొనే, దిశా పటానీ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. లెజెండరీ యాక్టర్లు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్రప్రసాద్, పశుపతి ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన కల్కి 2898 ఏడీ టైటిల్, గ్లింప్స్ వీడియో, టీజర్ మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతున్నాయి. మేకర్స్ చాలా రోజుల క్రితం విడుదల చేసిన కల్కి 2898 ఏడీ రైడర్స్ కాస్ట్యూమ్స్ మేకింగ్, అసెంబ్లింగ్ వీడియో సినిమాపై అంచనాలు పెంచేస్తూ.. సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నాయి. నాగ్ అశ్విన్ టీం కొన్ని రోజుల క్రితం ఇటలీలోని సర్దినియా ఐలాండ్‌లో ప్రభాస్, దిశాపటానీపై వచ్చే పాటను చిత్రీకరించారని తెలిసిందే. లొకేషన్‌లో ప్రభాస్, దిశాపటానీ స్టైలిష్ లుక్‌లో ఉన్న స్టిల్ సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. ఈ సాంగ్ ప్రభాస్ సూపర్ స్టైలిష్‌గా కనిపించబోతున్నట్టు నెట్టింట రిలీజ్ చేసిన క్లారిటీ ఇచ్చేస్తున్నాయి.

## 18న వస్తున్న.. పొట్టేల్

మల్లేశం, వకీల్‌సాబ్, మ్యాస్ట్రో వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న టాలీవుడ్ హీరోయిన్ అనన్య నాగళ్ల తాజాగా తంత్ర సినిమాతో ప్రేక్షకులను అలరించిన విషయం తెలిసిందే. ఈ సినిమా అనంతరం మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో ముందుకురాబోతుంది. ఆమె ప్రధాన పాత్ర పోషిస్తున్న తాజా చిత్రం 'పొట్టేల్' యువ చంద్ర కృష్ణ హీరోగా నటిస్తున్నాడు. ఈ సినిమాకు 'బంధం రేగడ్', 'సవారీ' సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న సాహిత్ మోతుకురి దర్శకత్వం వహిస్తున్నాడు. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా వస్తుండగా ఇప్పటికే సినిమా నుంచి విడుదల చేసిన గ్లింప్స్, పాటలు తెగ ఆకట్టుకున్నాయి. ఇదిలావుంటే తాజాగా మూవీ నుంచి చిత్రయూనిట్ టీజర్ అప్‌డేట్ ఇచ్చింది. ఈ సినిమా టీజర్‌ను శ్రీరామ నవమి కానుకగా ఏప్రిల్ 18న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది.యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల, అజయ్, ప్రియాంక శర్మ, తనస్వి చౌదరీ, నీల్ సీన్, చత్రపతి శేఖర్, శ్రీకాంత్ అయ్యంగార్, జీవన్, రియాజ్, విక్రమ్ తదితరులు ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.



# ఇంటి బిడ్డగా మీ ముందుకొస్తున్నా..



**ఆశీర్వదించి పార్లమెంటుకు పంపండి**

**అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తా**

**కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య**

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజల ఇంటి బిడ్డగా మీ ముందుకు వస్తున్నా..నన్ను ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించి పార్లమెంట్ కు పంపిస్తే అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య హామీ ఇచ్చారు. స్టేషన్ ఘనపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండు లక్షల మెజారిటీ ఇవ్వాలని, అవిధంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలనీ కోరారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, నియోజకవర్గ ఇంచార్జి సింగపురం ఇందిర ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం జఫర్ ఘడ్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో కడియం కావ్య పాల్గొని ప్రసంగించారు. దేశంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన అత్యవసరం ఏర్పడిందన్నారు. గత పదేళ్లుగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో ఎక్కడా రాజీ లేకుండా పని చేసే కడియం శ్రీహరి నాయకత్వంలో, నియోజకవర్గ ఇంచార్జ్ సింగపురం ఇందిర సహకారంతో అభివృద్ధిలో అగ్ర భాగంలో నిలుపుకుందామన్నారు. రానున్న ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి చేసుకోవాలన్నారు. అందుకు ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త ఒక సైనికుడిగా పని చేసి కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలని కోరారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఒక్క కాంగ్రెస్ పార్టీనే కనిపించాలంటూ పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి బీజేపీ మరోసారి అధికారంలోకి రావాలని చూస్తోందని ఆరోపించారు. నరేంద్ర మోడీ స్థానంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసుకోవాలని పిలుపునిచ్చారు. అభిప్రాయ బేధాలు ఉంటే పక్కన పెట్టి అందరం కలిసి ముందుకు వెళ్దామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జఫర్ ఘడ్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 500మంది బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



### పాలకుర్తిలో..

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో పేదలకు అందుతాయని డాక్టర్ కడియం కావ్య అన్నారు. పేదలు, బహుజనులు, ఆదివాసీలు, మైనార్టీలు, దళితుల అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. పాలకుర్తి మండల కేంద్రంలోని బృందావన్ గార్డెన్ లో స్థానిక శాసనసభ్యులు యశస్విని రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశంలో కడియం కావ్య పాల్గొని ప్రసంగించారు. ప్రధాని నరేంద్రమోదీకి కార్పొరేట్ సంస్థలపై ఉన్న ప్రేమ.. దేశ ప్రజలపై లేదని ఎద్దేవా చేశారు. ఆర్భాటపు ప్రకటనలు తప్ప బీజేపీ నాయకులు చేసేదే ఏమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు, పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ రేవూరి ప్రకాష్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి, వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, మాజీ ఎంపీ పసునూరి దయాకర్, వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఏఐసీసీ బీసీ సెల్ అధ్యక్షుడు కత్తి వెంకటస్వామి, నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, ముఖ్య నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తల్లితో గొడవపడుతున్న.. నానమ్మను హత్యచేసిన బాలుడు

**జనగామ జిల్లాలో దారుణం**

**వరంగల్ వాయిస్, జనగామ :** తల్లితో తరచూ గొడవ పడుతోందన్న కారణంతో 14 ఏళ్ల బాలుడు నానమ్మను కత్తితో పొడిచి చంపేశాడు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలంలోని ఉప్పుగల్లులో ఈ దారుణం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వృద్ధ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. అందరికీ వివాహాలు అయ్యాయి. పదేళ్ల క్రితం కుమారుడు అనారోగ్యంతో చనిపోయాడు. అప్పటి నుంచి అతడి భార్య తన ఇద్దరు కుమారులతో అత్తమామల వద్దే ఉంటోంది. ఇటీవల తరచూ అత్తమామలతో కోడలికి గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి కూడా ఇద్దరి మధ్య మరోమారు గొడవ జరిగింది. ఇది చూసిన మనవడు (14) నానమ్మపై కోపంతో కత్తితో ఆమె చాతీలో పొడిచాడు. దీంతో తీవ్ర



రక్తస్రావమైంది. ఆమెను హనుమకొండ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పరారీలో ఉన్న బాలుడి కోసం గాలిస్తున్నారు.

# వడ్డీల పేరుతో వేధిస్తే కఠిన చర్యలు

## ఐజీ ఏవీ రంగనాథ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వడ్డీ వ్యాపారులు ప్రజలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని మల్టీజోన్ -1 ఐజీ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. కొంత మంది వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి వేధింపులకు పాల్పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. డబ్బు చెల్లించని వారి నుంచి బలవంతంగా ఇల్లు, పొలాల పత్రాలను తీసుకుంటున్నట్టుగా ఫిర్యాదులు అందడంతో రంగనాథ్ స్పందించారు. మల్టీజోన్%-%1జిల్లాలు, పోలీస్ కమిషనరేట్ల పరిధిలో వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యక్తులు, సంస్థల ప్రాంగణాల్లో జిల్లాల ఎస్పీలు సోదాలు చేపట్టారు. ఈ మేరకు ఐజీ ఆఫీసు ప్రెస్ నోట్ వెలువరించింది. దాడుల్లో వడ్డీ వ్యాపారుల ఇండ్లు, సంస్థల నుంచి పెద్ద మొత్తంలో నగదు బంగారం, విలువైన డాక్యుమెంట్లు, చెక్కులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని కోర్టుల్లో అందజేయడంతో పాటు డబ్బును ఇన్ కంట్యాక్స్ అధికారులకు అప్పగిస్తామని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే మూడు రోజులుగా దాడులు చేపట్టామని వెల్లడించారు.

# 20 నుంచి పరకాలలో ఉచిత సమ్మర్ క్రికెట్ క్యాంప్

## 18 లోపు నమోదుకు అవకాశం

**వరంగల్ వాయిస్, పరకాల :** ఈ నెల 20నుంచి నెల రోజుల పాటు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎంపిక చేసిన 28 సెంటర్లలో ఉచిత సమ్మర్ క్రికెట్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు పరకాల స్టార్ క్రికెట్ క్లబ్ కార్యదర్శి అభినవ వినయ్ కుమార్ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేసన్ ఆధ్వర్యంలో పరకాలకి క్రికెట్ క్యాంప్ మంజూరైందన్నారు. అండర్ 14, అండర్ 16, అండర్ 19, అండర్ 23 విభాగాల్లో బాల, బాలికలకు వేర్వేరుగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఉచిత క్రికెట్ క్యాంప్ కు హాజరయ్యే వారు విధిగా https://www.hycricket.org వెబ్ సైట్ లో ఈనెల 18లోగా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ చూసిన క్రీడాకారులు మే నెల చివరిలో హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర క్రికెట్ అకాడమీ పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. పూర్తి వివరాలకు క్యాంప్ ఇంచార్జి అరుణ్ సెల్ 88868 39822 నెంబర్ లో సంప్రదించాలన్నారు.

# సీతారాముల కల్యాణ ప్రత్యక్ష ప్రసారానికి అనుమతివ్వండి

## ఎన్నికల కమిషనర్‌ను కోరిన మంత్రి సురేఖ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈ నెల 17న శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచల సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు అనుమతివ్వాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కోరారు. ఇప్పటికే కల్యాణ మహోత్సవ ప్రత్యక్ష ప్రసారాలకు ఎలక్షన్ కమిషన్ అనుమతి నిరాకరించినందున మంత్రి సురేఖ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ కు ఈ మేరకు లేఖ రాశారు. కులమతాలకు అతీతంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది భక్తులు వీక్షించాలనుకునే కల్యాణ మహోత్సవ ప్రత్యక్ష ప్రసారాలను ఎన్నికల కోడ్ నుంచి మినహాయించాలని కోరారు. భద్రాచలం శ్రీ సీతారాముల దేవస్థానం ప్రాశస్త్యం, ఆచార సాంప్రదాయాలు, భక్తుల నమ్మకాలు, కల్యాణ మహోత్సవం సందర్భంగా దాదాపు 40 ఏళ్ళ నుంచి సాగుతున్న ప్రత్యక్ష ప్రసారాల అంశాన్ని మంత్రి సురేఖ లేఖలో ప్రస్తావించారు.

# ఏసీబీకి చిక్కిన ఆర్టీసీ డిపో మేనేజర్



**వరంగల్ వాయిస్, ఎల్కతుర్తి :** ఎల్కతుర్తి మండల పరిధిలో సోమవారం స్థానిక మన్విత హెూటల్ లో ఆర్టీసీ డిపో మేనేజర్ డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కారు. హుజూరాబాద్ డిపోకు చెందిన డ్రైవర్ తాడికొండ రవీందర్ కు డిపో మేనేజర్ శ్రీకాంత్ చార్జి మెమో ఇచ్చారు. ఈ మెమో ఎత్తేయడానికి రూ.30 వేలు డిమాండ్ చేశారు. రూ.10 వేలు ఇచ్చినప్పటికీ మిగతా డబ్బుల కోసం డిమాండ్ చేయగా విసుగు చెంది డ్రైవర్ రవీందర్ ఏసీబీని ఆశ్రయించారు. సోమవారం మన్విత హెూటల్ లో రూ.20 వేలు లంచం తీసుకుంటున్న హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ ని రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలోని అధికారులు పట్టుకున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com